# దక్షిణాపథ వార్తావని

ఆగష్టు 2025

సంపుటి - 02
సంచిక - 08


## శ్రీకృష్ణాష్టమి (ఆగష్టు16)




ద్వాపరయుగంలో శ్రీ ముఖ నామ సంవత్సరం, శ్రావణం మాసం బహుళ అష్టమి నాడు అర్ధరాత్రి రోహిణి నక్షత్ర సమయంలో శ్రీ కృష్ణ జననం జరిగిందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీ కృష్ణుడు పరిపూర్ణుడు. అన్ని అవతారాలలో కృష్ణావతారమే పూర్ణావతారామని ప్రసిద్ధి. అందుకే ఆయన్ని కృష్ణ పరమాత్మ అంటారు. కృష్ణ పరమాత్మ ఆవిర్భవించిన దివ్య తిథియే "కృష్ణాష్టమి". ఈ పండుగ రోజున ఉదయాన్నే స్నానాదులు పూర్తి చేసి షోడశోపచారాలతో కృష్ణుని అర్చించాలి.

పూజాది క్రతువులు పూర్తైన తర్వాత శ్రీకృష్ణ లీల ఘట్టాలని చదవాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. కృష్ణాష్టమి నాడు కేవలం భగవానుని పూజించడమే కాదు, అయనలోని కొన్ని మంచి లక్షణాలని అలవర్చుకోవాలి. ప్రతి విషయంలోను స్వార్థం, ఈర్ష్య, అసూయలను కొంతైనా విడనాడి, మానవజన్మకు సార్ధకతని ఏర్పరచుకోవాలి.

కృష్ణతత్వాన్ని పరిశీలిస్తే, తన లీలల ద్వారా భక్తులకు జ్ఞానోపదేశం చేశాడు. ఆయన చేసిన అన్ని పనులలోను అర్థం, పరమార్థం కనిపిస్తాయి. ధర్మ పరిరక్షణలో రాగద్వేషాలకతీతంగా వ్యవహరించాడు. ఈ రోజున కృష్ణుని అర్చిస్తే సకల పాపాలు పోతాయి. ధర్మార్ధ కామ మోక్ష ప్రాప్తి కలుగుతాయని స్కాన్దపురాణం చెబుతుంది. ఈ రోజున బంగారంతో కాని, వెండితో కాని చంద్రబింబాన్ని తయారుచేసి వెండి, బంగారు పాత్రలలో దానిని ఉంచి పూజించి నీరు వదిలిన సకల కోరికలు తీరుతాయని భవిష్యోత్తర పురాణం ద్వారా తెలుస్తుంది.

అంతే కాకుండా ఈ రోజు భీష్మాచార్యులను పూజిస్తే సకల పాపాలు తొలగుతాయని మహర్షులు చెప్పారు. సంతానం లేని వారు బాల కృష్ణుడిని సంతానా గోపాల మంత్రం తో పూజిస్తే సంతానం కలుగుతుంది. అదే విధంగా వివాహంకానివారు, వివాహ ప్రయత్నాలు చేస్తున్న వారు రుక్మిణి కళ్యాణం పారాయణం చేయడం వల్ల వారికి వివాహయోగం కలుగుతుంది. చివరగా శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన విధం గా "నీ కర్తవ్యాన్ని నీవు చిత్త శుద్ధితో నిర్వహించు, పలితాన్ని నాకు వదిలేయి"..అనే మాటను ఆచరణ లో పెడితే మనమందరం సుఖంగా జీవించవచ్చు.

## శ్రీ అరవిందులు (జన్మతిథి, ఆగష్టు 15)



శ్రీ అరబిందో 1872 ఆగస్టు 15న కలకత్తాలో జన్మించారు. ఏడేళ్ల వయసులో ఆయనను విద్య కోసం ఇంగ్లాండ్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆయన లండన్‌లోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో మరియు కేంబ్రిడ్జ్‌లోని కింగ్స్ కాలేజీలో చదువుకున్నారు. 1893లో భారతదేశానికి తిరిగి వచ్చిన ఆయన, బరోడా ప్రిన్స్లీ స్టేట్‌లో మహారాజా సేవలో మరియు బరోడా కళాశాలలో ప్రొఫెసర్‌గా పదమూడు సంవత్సరాలు పనిచేశారు. ఈ కాలంలో ఆయన ఒక విప్లవాత్మక సమాజంలో కూడా చేరారు మరియు భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు రహస్య సన్నాహాలలో ప్రముఖ పాత్ర పోషించారు.

1906లో, బెంగాల్ విభజన జరిగిన వెంటనే, శ్రీ అరబిందో బరోడాలోని తన పదవిని వదులుకుని కలకత్తాకు వెళ్లారు, అక్కడ ఆయన జాతీయవాద ఉద్యమ నాయకులలో ఒకరిగా మారారు. తన వార్తాపత్రిక అయిన బందేమాతరంలో దేశానికి పూర్తి స్వాతంత్ర్యం అనే ఆలోచనను బహిరంగంగా ముందుకు తెచ్చిన మొట్టమొదటి రాజకీయ నాయకుడు ఆయన. రెండుసార్లు దేశద్రోహం నేరముపైన మరియు ఒకసారి కుట్ర కోసం విచారణకు గురయ్యారు. ప్రతిసారీ ఆధారాలు లేకపోవడంతో ఆయన విడుదలయ్యారు.

శ్రీ అరబిందో 1905లో బరోడాలో యోగాభ్యాసం ప్రారంభించారు. 1908లో ఆయనకు అనేక ప్రాథమిక ఆధ్యాత్మిక సాక్షాత్కారాలలో మొదటిది లభించింది. 1910లో ఆయన రాజకీయాల నుండి వైదొలిగి తన అంతర్గత ఆధ్యాత్మిక జీవితం మరియు ఆ పనికి పూర్తిగా అంకితం కావడానికి పాండిచ్చేరికి వెళ్లారు. పాండిచ్చేరిలో తన నలభై సంవత్సరాల కాలంలో ఆయన ఒక కొత్త ఆధ్యాత్మిక సాధన పద్ధతిని అభివృద్ధి చేశారు, దీనిని ఆయన సమగ్ర యోగా అని పిలిచారు. దీని లక్ష్యం మనిషి చైతన్యాన్ని విముక్తి చేయడమే కాకుండా అతని స్వభావాన్ని కూడా మార్చే ఆధ్యాత్మిక సాక్షాత్కారం. 1926లో, తన ఆధ్యాత్మిక సహకారి అయిన మదర్ సహాయంతో, శ్రీ అరబిందో ఆశ్రమాన్ని స్థాపించారు. ఆయన రాసిన అనేక రచనలలో ది లైఫ్ డివైన్, ది సింథసిస్ ఆఫ్ యోగా మరియు సావిత్రి ఉన్నాయి. శ్రీ అరబిందో 1950 డిసెంబర్ 5న తన శరీరాన్ని విడిచిపెట్టారు.


www.dakshinapatha.com www.csisindia.com


దక్షిణాపథ స్టడీస్ బులెటిన్

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact research@csisindia.com

Contact : +917075881925

## శ్రీ నారాయణగురు (జన్మతిథి, ఆగష్టు 20)



సామాజిక మార్పునకు ఒక చక్కటి దిశను అందించిన గొప్ప సాధు పుంగవుడు శ్రీ నారాయణ గురు. దీన, దుఃఖిత, పీడిత జన సేవకుడు. ఒక్కటే సమాజం, ఒకే ధర్మం, ఒకే దేవుడు, అతడే అందర్నీ పాలిస్తున్నాడు అన్న మౌలిక సందేశాన్ని సమాజానికి అందించిన మహాత్ముడు.

నారాయణగురు క్రీ.శ. 1854 ఆగస్టు 20న కేరళలోని 'చంపాజండి' గ్రామంలో 'ఈళవ' కులంలో మదన్ ఆశాన్, కుట్టి అమ్మ దంపతులకు జన్మించాడు. అందరూ ఆయనను ' నానూ' అని పిలిచేవారు. చట్టాంబీ స్వామి అనబడే కుంజన్ పిళ్ళై వద్ద సంస్కృతాన్ని అధ్యయనం చేశాడు. తిక్కాడ్ అయ్యబూ వద్ద యోగశాస్త్రాన్ని అభ్యసించాడు. నారాయణ గురు అరవీపురం అడవుల్లో ధ్యానంలో ఉండి చాలాకాలం తపస్సు చేశాడు. ఇతరులకు మేలు చేయడంలోనే నిజమైన ఆనందం ఉందనే జీవన రహస్యాన్ని తెలుసుకున్నాడు. అక్కడే ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. రోగులకు సేవ చేస్తూ పేదలైన గిరిజనులకు, హరిజనులకు సేవా సహాయ కార్యక్రమాలు ప్రారంభించాడు. కేరళ, తమిళనాడు ప్రాంతాలలో పర్యటించినప్పుడు క్రైస్తవ ఫాదరీలు హిందూ ధర్మం మీద, సమాజం మీద చేస్తున్న దాడులను చూచి దానిని ప్రతిఘటించాలని నిశ్చయించుకున్నాడు. కేరళ ప్రాంతంలో ఆనాడు కులతత్వం, అంటరానితనం అనే భూతాలు విలయ తాండవం చేస్తున్నాయి. అందుకే వివేకానందుడు కేరళను పిచ్చాసుపత్రిగా వర్ణించాడు. ఈ భూతాన్ని అంతం చేయాలని నడుం కట్టాడు నారాయణ గురు. తన ఆశ్రమంలో శివాలయాన్ని కట్టించాడు. " దేవుడి ముందు అందరూ సమానులే. ఉన్నత నీచ భావాలకు ఆయన అతీతుడు" అని నారాయణగురు ప్రజలకు సందేశాన్నిచ్చాడు. నారాయణ గురు అనేకచోట్ల గుడులు కట్టించి అక్కడ హరిజనులకు ప్రవేశాన్ని కల్పించాడు. ఆ దేవాలయాలు హిందూ సంఘటనకు కేంద్రాలయినాయి. ఈ విధంగా సమాజానికి ఒక కొత్త ఆదర్శాన్ని చూపించాడు. ప్రజలలోని మూఢనమ్మకాలను తొలగించడానికి ఉద్యమించాడు. ఆయన పశు హింసను సహించలేకపోయాడు. జంతుబలిని ఆపించడంలో ఆయన విజయం సాధించాడు. ప్రజలకు పారిశుధ్య ప్రాముఖ్యతను, నిరాడంబర జీవన మహిమను తెలియజేశాడు. హిందూ ధర్మాన్ని విడిచిపెట్టి క్రైస్తవులలో చేరిన వారిని తిరిగి స్వధర్మం వైపు మళ్ళించాడు.

1913లో శ్రీ నారాయణ గురు ఆలువాయిలో అద్వైతాశ్రమాన్ని స్థాపించారు. "ఓం సహోదర్యం సర్వం" అనే సందేశంతో మానవులంతా సమానమే అనే లక్ష్యంతో కార్యక్రమాలు జరుగుతుండేవి. మంగుళూరు నుండి సింహళం వరకు తీర ప్రాంతాలలో " సర్వత్ర బంధుత్వ" సమ్మేళనాలు జరిగాయి. రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీజీలు కూడా శ్రీ నారాయణ గురును సందర్శించుకున్నారు. నారాయణ గురు 'జాతి మీమాంస' అనే గ్రంథాన్ని వ్రాశారు. "దేశంలోని ప్రతి వ్యక్తి ఉద్యమిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుంది" అనే సందేశమిచ్చిన నారాయణ గురు 1928 సెప్టెంబర్ 20న పరమపదించారు.

(వి ఎస్ కే ఆంధ్రప్రదేశ్ సౌజన్యంతో)

## చిత్రదుర్గ కోట



చిత్రదుర్గ కోట కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఉంది. ఇది ఒక పర్వతం పైన ఉంది. భారీ రాతి దిమ్మెలతో నిర్మించబడింది. ఈ కోటను స్థానికంగా చిట్టల్ దుర్గ అని కూడా పిలుస్తారు. ఈ కోట ఒక రక్షణాత్మక కోట. ఈ కోట 10వ శతాబ్దంలో నిర్మించబడింది మరియు 18వ శతాబ్దం మధ్యకాలం వరకు నిరంతరం ఉపయోగంలో ఉంది. ఈ కోట ప్రధాన నిర్మాతలు చాళుక్యులు, హొయసలులు మరియు విజయనగర సామ్రాజ్యం.
హంపి విజయనగర పతనం తర్వాత నాయక రాజవంశం కింద ఉన్న చిత్రదుర్గ రెండు వందల యాభై సంవత్సరాలు కొనసాగింది.

కోట పైభాగంలో పద్దెనిమిది ఆలయాలు ఉన్నాయి. దిగువ కోటలో దేవికి అంకితం చేయబడిన పెద్ద ఆలయం ఉంది. ఈ సముదాయంలో అత్యంత ఆసక్తికరమైన ఆలయం హిడింబేశ్వరి అని పిలువబడే హిడింబికి అంకితం చేయబడిన ఆలయం. ఇది ఆలయాలలో పురాతనమైనది మరియు మహాభారతంలోని హిడింబతో ముడిపడి ఉంది. హిడింబ భీముడి భార్య మరియు ఘటోత్కచుని తల్లి.

ఈ సముదాయంలోని ఇతర ముఖ్యమైన ఆలయాలు గోపాల కృష్ణ, నంది, సుబ్బరాయ, ఏకనాథమ్మ, హనుమాన్, ఫల్నేశ్వర్ మరియు సిద్ధేశ్వరులకు అంకితం చేయబడ్డాయి.

కోట లోపల పద్దెనిమిది ఆలయాలు ఉన్నాయి. కొన్ని మసీదులు కోట లోపల కూడా ఉన్నాయి. ఈ మసీదులను హైదర్ అలీ కూల్చివేసిన ఆలయాల ఆధారంగా నిర్మించాడు.

బాహ్య సరఫరాల నుండి స్వయంప్రతిపత్తి కోసం వర్షపు నీటిని సేకరించి నిల్వ చేయడానికి కోట విస్తృతమైన నిర్మాణాలను కలిగి ఉంది. దీని వలన కోట ఎక్కువ కాలం రక్షణను కొనసాగించగలిగింది.

ఈ కోటతో ముడిపడి ఉన్న అత్యంత ప్రాచుర్యం పొందిన కథలలో , కీలకమైన గంటతో పాటు కోటలోకి రహస్య ప్రవేశ ద్వారం కోసం ఒంటి చేత్తో పోరాడిన ఒనకే ఓబవ్వ కథ ఒకటి .

తరువాతి ప్రయత్నాలలో హైదర్ అలీ చివరికి కోటను గెలుచుకున్నాడు. అయితే, నిరంకుశులు మరియు ఆక్రమణదారులకు వ్యతిరేకంగా హిందూ జాతీయ ప్రతిఘటన జ్ఞాపకార్థం ఓబవ్వ కథ అమరత్వం పొందింది.

## భైరన్ పల్లి మారణకాండ (ఆగష్టు 27)

నిజాం పాలనలో ముస్లిం మతోన్మాదులు, రజాకార్లు యథేచ్ఛగా ఆనాటి హైదరాబాద్ స్టేట్ లోని ప్రజల నుంచి చందాల పేరుతో డబ్బులు వసూలు చేసి, ఇవ్వని గ్రామాలపై దాడులకు పాల్పడి, దోచి తగులపెట్టి కసి తీర్చుకునేవాళ్ళు.

అలాంటి సంఘటనే నాటి నల్గొండ జిల్లాలోని భైరవునిపల్లెలో జరిగింది.

ఈనాడు ఈ గ్రామం సిద్ధిపేట జిల్లాలో అంతర్భాగం. భైరవునిపల్లి ప్రజలు గ్రామ నివాసి శ్రీ ఇమ్మడి రాజిరెడ్డి నాయకత్వంలో రజాకార్లను ప్రతిఘటించి తమ ఆత్మాభిమానాన్ని నిరూపించుకున్నారు. ఆయన మాటల్లో చెప్పాలంటే "రజాకార్లు మజాకర్లుగా తయారై యథేచ్ఛగా గ్రామాలను దోచుకునేవాళ్ళు. తగులబెట్టేవాళ్ళు. చందాల పేరుతో డబ్బులు వసూలుచేసేవారు. ఇవ్వని గ్రామాలపై దాడిచేసి, దోచి తగులపెట్టి కసి తీర్చుకునేవాళ్ళు.




భైరవునిపల్లి గ్రామానికి 12 వందల రూపాయలు చందా ఇమ్మని తాఖీదు పంపారు రజాకార్లు. భైరవునిపల్లి గ్రామం చుట్టూ కోటగోడ ఉండేది. ఈ గోడకి ఎత్తయిన బురుజుండేది. సురక్షితంగా ఎత్తుగా ఉన్న ఈ బురుజు భైరవునిపల్లి గ్రామానికి ఎంతో మేలు చేసింది. ఇదే బురుజుపైన మందుగుండు సామాగ్రి వగైరా సేకరించి ఇరువది నాలుగు గంటలపాటు గ్రామస్తులలో ఇద్దరు తుపాకులు చేతబూని కాపలా కాస్తుండేవాళ్ళు. రజాకార్లు కనపడితే బురుజుపైనున్న నగారా మ్రోగించే వాళ్ళు. గ్రామస్థులు పనులు వదలి గ్రామరక్షణకు సిద్ధమయ్యేవారు. చుట్టుప్రక్కల ఉన్న ఆరేడు గ్రామాలను కూడా ఇలాగే తయారుచేసి రక్షణ దళాలను ఏర్పరిచారు. యాభైమంది కర్రలతో, గొడ్డళ్ళతో సహా అన్ని గ్రామాల్లో తిరిగి ధైర్యం చెబుతుండే వారు. ఈ గ్రామాలలో వైర్‌లెస్ వార్తాహరుడిగా శ్రీ విశ్వనాథ భట్ జోషి సైకిలుపై తిరుగుతూ తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించేవాడు. గ్రామాల పరిస్థితిపై రైతులకు సమాచారంగా అందచేసేవాడు.

కొంతకాలం తర్వాత హైద్రాబాద్ రియసత్ ప్రధానమంత్రి అయిన లాయక్ ఆలీ చెరియాల ప్రాంత పర్యటనకు వచ్చాడు. ఇమ్మడి రాజిరెడ్డి నాయకత్వాన వెయ్యిమంది గ్రామస్థులు వెళ్ళి రజాకార్ల దాడుల గురించి చెప్పాడు. ఆయన అందరూ కలిసిమెలసి ఉండాలనీ నీతులు చెప్పి వెళ్ళిపోయాడు. ఇక లాభంలేదని ఆ ప్రాంతాలలో గ్రామీణులు తమ ఆత్మరక్షణకు ఆయుధాలు వగైరా సేకరించటం మొదలుపెట్టారు. భైరవునిపల్లి బురుజుపై వల్లపట్ల రామచంద్రరావు దేశ్‌ముఖ్ నుండి సంపాదించిన ఫిరంగిని పెట్టారు. నాలుగైదు మణుగుల మందుగుండు సామాగ్రి తయారుగా ఉండేది. అలాగే గ్రామంలో కంసాలి ఇనుపగుండ్లను తయారుచేసేపని మొదలుపెట్టాడు. బెక్కల్, ధూళిమిట్ట, తోరసాల్, జాలపల్లి, కొండాపూర్, కుటిగల్, సోలిపూర్, అంకుశీపూర్ తదితర గ్రామాలు తమ రక్షణదళాలు ఏర్పాటు చేసుకున్నాయి. వీటన్నింటికి భైరవునిపల్లి కేంద్ర బిందువుగా పనిచూస్తూ వచ్చింది. అందువల్ల ఈ గ్రామంపై రజాకార్లు తమ దృష్టిని కేంద్రీకరించారు. భువనగిరి డిప్యూటీ కలెక్టర్ హాషిం కూడా భైరవునిపల్లి గ్రామస్థులను తిరుగుబాటుదార్లుగా భావించి దాడిచేయటానికి సిద్ధపడ్డాడు. ఈ గ్రామస్థుల ధైర్యం తనకు సవాలుగా కనిపించింది. కొడకండ్ల గ్రామంలో దాదాపు నలభై మంది నిర్దోషులను కాల్చి చంపేశాడు. తర్వాత 150 మంది గల తన ముఠాతో భైరవునిపల్లి చేరుకున్నాడు. బురుజు పైనుండి ఈ ముఠాను పసిగట్టిన కాపలాదారులు నగారా మ్రోగించారు. చిన్న ఫిరంగి కాల్పులకు హాషిం ముఠా తట్టుకోలేక పోయింది.

ఉదయం పదిగంటల నుండి సాయంత్రం వరకు రెండువైపుల నుండి కాల్పులు కొనసాగాయి. ఎంత ప్రయత్నించినా హాషిం తన ముఠాతో గ్రామంలో ప్రవేశించలేకపోయాడు. ఎనిమిది గంటలపాటు సాగిన ఈ పోరాటంలో హాషిం ముఠా నలుగురు నిరాయుధులను మాత్రం చంపగలిగింది. తమ పక్షాన పదిహేను మందికి పైగా చనిపోయాక, వాళ్ళను బళ్ళపై వేసుకొని తిరుగుముఖం పట్టక తప్పలేదు. తన ప్రయత్నం విఫలం కాగా హాషిం మరింత కసితో ఆ గ్రామాన్ని నేలమట్టం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. విజయవంతమైన తమ పోరాటం వల్ల భైరవునిపల్లి గ్రామస్థుల ధైర్యం మరింత పెరిగింది. రజాకార్ల ముఠాలను నిర్భయంగా ఎదుర్కొనగలమనే ధీమా హెచ్చింది. అయితే నిజాం సైన్యం ముందు తాము నిలువగలమా? అనే అంశాన్ని వాళ్ళు తీవ్రంగా ఆలోచించలేదు. సైన్యం వచ్చి చుట్టుముట్టనున్నదనే వార్త తెలిసినా గ్రామం ఖాళీచేసి అడవుల్లోకి పారిపోవాలనే ఆలోచనే వాళ్ళకు తట్టలేదు. తత్ఫలితంగా భైరవునిపల్లి సర్వనాశనం కాక తప్పలేదు.

సూర్యాస్తమయం అవుతున్నవేళ, పల్లె ప్రజలు ఇళ్ళకి తిరిగొస్తున్నపుడు చుట్టూరా ప్రశాంత వాతావరణం. వరిచేలు గాలికి రెపరెపలాడుతున్నాయి. గ్రామం ముందు బురుజు కాలం తాకిడికి తట్టుకొని ఆనాటికీ అజేయంగా నిలిచి ఉంది. గ్రామంలో ఆవులని, దూడలని తోలుకుని పశువుల కాపర్లు ఉత్సాహంతో వస్తున్నారు. బావుల దగ్గర నీళ్ళు నింపుతూ ఆడవాళ్ళు కబుర్లు చెప్పుకుంటున్నారు. ఉదయం జరుగబోయే ప్రళయం ఆ సాయంత్రం ఎవరి ఊహకూ తట్టలేదు. భైరవునిపల్లి గ్రామస్థులలో ఉన్న ఐక్యత పెట్టనికోటగా రూపొందింది. చుట్టు ప్రక్కల గ్రామాలకు ఆ గ్రామస్థుల సాహసం, పట్టుదల ఆదర్శంగా కనపడింది. అనేక గ్రామాలలో రజాకార్ల దురంతాలు మితిమీరిపోయినా ఈ గ్రామంపైకి మాత్రం రాలేకపోయారు. నవాపేట్, నెలటోల, యశ్వంతపూర్, కోమల్లా, చింటకుంట, నీలిగొండ తదితర గ్రామాల్లో రజాకార్ల వల్ల జరిగిన మానభంగాలు, దోపిళ్ళు, దహనాలు, హత్యలు మామూలు వార్తలైపోయినాయి. అయినా భైరవునిపల్లి ప్రజలు మాత్రం వీటి నుండి దూరంగా సురక్షితులమనే భావంతో నిద్రపోతున్నారు. భైరవునిపల్లి ఆక్రమించాలని బయలుదేరిన నిజాం సైనిక బలగం ముస్త్యాల గుండా వల్లపట్ల చేరుకుంది. వల్లపట్ల నుండి సైన్యాన్ని మళ్ళించి మరోవైపు నుండి భైరవునిపల్లిని చుట్టుముట్టమని ఆదేశించారు. గ్రామాన్ని అరమైలు పరిధిలో సైన్యం చుట్టుముట్టింది. ఉదయం నాలుగున్నర ప్రాంతంలో ఈ భారీ ఎత్తున ఉన్న బలం భైరవునిపల్లి మీద దాడికి సిద్ధంగా ఉంది. ఈలోగా ఊరి బయటికి కాలకృత్యం తీర్చుకోవడానికి వచ్చిన ఒక వ్యక్తి ఈ సైన్యాన్ని చూసి అదిరిపోయాడు. ఈ వ్యక్తి ఎవరో కాదు. ఆ ఊరి బ్రాహ్మణుడు విశ్వనాథ్ భట్ జోషి. ఆయనను షూట్ చేయాలని అధికారులు అన్నారు. అయితే వెంటవచ్చిన హిందూ అధికారి శ్రీ యం. యన్. రెడ్డి, జోషిచేత మాట్లాడించి అమాయకుడైన బ్రాహ్మణుడనే విషయం స్పష్టంచేయ ప్రయత్నించాడు. ఈలోగా అక్కడే ఇద్దరు సైనికులు ఆ గ్రామ నివాసి ఉల్యంగల వెంకట నర్సయ్య అనే వ్యక్తిని పట్టుకొన్నారు. అతను విడిపించుకొని గ్రామంలోకి పరుగు లంకించుకున్నాడు. మరుసటి క్షణమే బురుజుపై ఉన్న నగారా మ్రోగింది. చిన్న ఫిరంగి కాల్పులు ప్రారంభమయ్యాయి. అయితే చుట్టుముట్టిన సైనిక బలగం దగ్గర పెద్ద ఫిరంగి ఉంది. ఇటునుండి వరుసగా పదమూడు గుళ్ళను సైనికులు పేల్చారు. ఈ ప్రేలుడు చప్పుడు చుట్టుప్రక్కల గ్రామాలకు వినబడింది. గ్రామంలో అనేక ప్రాంతాలలో నిప్పు అంటుకుంది. కొన్ని ఇళ్ళు కూలిపోయాయి

**ముఖ్యమైన రక్షణ సామాగ్రి ధ్వంసం**

అప్పటికి బాగా వెలుగు వచ్చేసింది. బురుజుపైన ఇద్దరు యువకులు లేచి నిలబడి చూస్తుండగానే గుండు వచ్చి తగిలింది. మగుటం రామయ్య, భూమయ్య అనే ఆ ఇద్దరు వ్యక్తులు అక్కడే కూలిపోయారు. అక్కడి గది వగైరా అంతా కూలి ముఖ్యమైన రక్షణ సామాగ్రి ధ్వంసమైపోయింది. గ్రామస్థులు ఇది రజాకార్ల దాడి కాదనే విషయాన్ని గ్రహించారు. ప్రతిఘటించి ప్రయోజనం లేదని బురుజు పైనుండి తెల్లజెండా చూపారు. అయినా నిజాం సైన్యం ఫిరంగి

కాల్పులు జరుపుతూనే వచ్చింది. గ్రామంలోకి చొచ్చుకొని వస్తున్న సైనికులు అడవి జంతువులలాగా ప్రవర్తించారు. కనబడిన ప్రతి అమాయకుణ్ణి కాల్చివేశారు. ఒకమూల నిలబడి సైనికులు పదిమంది యువకులపైకి చేతిబాంబులువేసి చంపివేశారు. అందులో విశ్వనాథ్ భట్ జోషి తదితరులు ప్రాణాలు కోల్పోయారు. ఎంతోమంది నిరపరాధులైన గ్రామస్థులు హత్య చేయబడ్డారు. అందులో అప్పుడే ప్రసవించిన తల్లి కూడా ఉంది. తర్వాత శవాలను గుర్తిస్తున్నపుడు సజీవంగా ఉన్న శిశువు లభించింది. గ్రామంలో ప్రతిఘటనా శక్తి సర్వస్వం నాశనమై పోయింది.నిజాం ప్రభుత్వ అధికారులు, సైనికులు విజయోన్మాదంతో పాశవిక చర్యలకు దిగారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన ఏదో పెద్ద తిరుగుబాటును అణచివేశామనే గర్వంతో విర్రవీగుతూ భైరవునిపల్లి నేలమట్టం చేశారు. ప్రతి ఇంట్లోకి వెళ్ళి యువకులను ఏరి పశువుల్లా బంధించి తీసుకువచ్చారు. స్త్రీలను బలాత్కరించారు. ఇళ్ళను దోచుకున్నారు. గడ్డివాములను తగులబెట్టారు. మత పిచ్చి ఎక్కి దుష్కృత్యాలు జరిపిన గూండాలకు ఈ నిజాం ప్రభుత్వం అధికారులకు మధ్య తేడాలేదు అనిపించింది. ఊరు అవతలికి 92 మంది యువకులను పట్టి తెచ్చి నిలబెట్టారు. వాళ్ళలో ఇద్దరు ముసలివాళ్ళు కూడా ఉన్నారు. అధికారులు తమ షూటింగ్ నైపుణ్యాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమై నిల్చున్నారు. త్రీనాట్ త్రీ రైఫిల్‌తో వరుసగా ఒకేసారి ఒకే గుండుతో ఎంతమందిని చంపవచ్చునో అంచనా వేసుకున్నారు. నాలుగు వరుసలలో ఒకరి వెనుక ఒకరిని నిలబెట్టారు. కట్టివేయబడిన యువకులు బలిపశువుల్లా నిలుచున్నారు. మొదట ఒక సైనికాధికారి కాల్పులు జరిపాడు. ఒకేగుండు వరుసగా నలుగురి శరీరాల గుండా దూసుకుపోయి మరోవైపు వెళ్ళింది. ఫలితంగా ఆ నలుగురు యువకులు నేలకూలిపోయారు. రెండోసారి ఒక పోలీసు అధికారి ఫైరింగ్ చేయగా ముగ్గురు చనిపోయారు. ఇక సివిల్ అధికారులు తమ బలాన్ని ప్రదర్శించుకోవడానికి ముందుకు వచ్చారు. భువనగిరి డిప్యూటి కలెక్టర్ హాషిం కసితో ఎనిమిదిమందిని కాల్చి చంపాడు. ఇద్దరు ముసలివాళ్ళను వదలి దాదాపు అందరినీ స్టెన్‌గన్‌తో కాల్చి హత్య చేశారు. ఈ దారుణ హత్యాకాండలో రజాకార్ల సర్వసైన్యాధికారియైన ఖాసిం రజ్వీ ముఖ్య అనుచరుడైన మొహజ్జిం హుస్సేన్ (నల్గొండ) అత్యధికమైన భాగాన్ని పంచుకున్నాడు. తర్వాత గ్రామంలో హరిజనులను పిలిచి 90 మంది శవాలను నిరుపయోగంగా ఉన్న ఒక బావిలో పడవేయించి సామూహిక సమాధి చేశారు.

## ధర్మపురి లక్ష్మీనృసింహ క్షేత్రం



ధర్మపురి తెలంగాణాలోని ఒక ప్రముఖ పుణ్యక్షేత్రం, తీర్థరాజం. శ్రీ లక్ష్మీనృసింహుడు యోగనారసింహుడిగా, ఉగ్ర నారసింహుడిగా రెండు అవతారాల్లో ఇక్కడ కొలువై ఉన్నాడు. ఉత్తర తెలంగాణాలోని కరీంనగర్ జిల్లాకు ఉత్తరంగా 65 కిలోమీటర్ల దూరంలో, జగిత్యాలకు 27 కిలోమీటర్ల దూరంలో గోదావరి నదీతీరాన ఈ క్షేత్రరాజం ఉంది. ఇక్కడ గోదావరి నది దక్షిణవాహినిగా తన పవిత్రతను చాటుకొనుచున్నది. ఎంతో ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలు, చరిత్ర కలిగిన ఈ క్షేత్రం ప్రాచీన కాలంనుంచి వైదిక విద్యలకు, జ్యోతిశ్శాస్త్రానికి ప్రముఖస్థలముగా పేరొంది నేటికీ సాంప్రదాయ వేదవిద్యలకు నెలవైయున్నది.

పూర్వకాలములో ధర్మవర్మ అనే మహారాజు నృసింహుడిని గూర్చి తపమాచరించగా, నృసింహుడు అతని తపస్సుకు మెచ్చి లక్ష్మీ సమేతుడై యోగ నారసింహుడుగా ఈ క్షేత్రమందు అవతరించెను. ధర్మపురి క్షేత్రం పితృకర్మలకు, కుజదోష నివారణకు ప్రసిద్ధము. కుజదోషమున్న వారు ఈ క్షేత్రమందు స్వామివారికి కళ్యాణము చేయించిన వారి కుజదోష నివారణము జరిగి శీఘ్రంగా వివాహమవటం ఇక్కడి క్షేత్ర మహాత్మ్యం. సాధారణంగా కుజదోషం అంటే వివాహానికి ముందే దానికి సంబంధించిన పరిహారక్రియలు చేసుకోవటం చేస్తుంటారు. కొన్ని సార్లు కుజదోషం ఉన్నట్లు తెలియక వివాహం చేసుకోవటం జరుగుతుంది. అటువంటి సందర్భాల్లో వివాహానంతరం వైవాహిక జీవితం సమస్యల పాలవటం కద్దు. ధర్మపురి క్షేత్రం వివాహానంతరం కుజదోషం కారణంగా వచ్చే సమస్యలకు మంచి పరిహారం. దంపతులు ఇక్కడ గోదావరి తీరంలో సరిగంగ స్నానాలాడి, స్వామివారిని అర్చించినచో ఎటువంటి వైవాహిక సమస్యలైనా ఇట్టే తొలగిపోతాయి. ఇక్కడ ఒక కవి అయిన కాకుత్సం శేషప్ప కవి శ్రీ నరసింహ శతకం రచించాడు.

స్కాంద పురాణములో ధర్మపురి క్షేత్రమహత్యము వర్ణింపబడియున్నది. పూర్వం బలివర్మ అనే రాజు ఉండేవాడు.అతనికి అల్పాయుష్కుడైన కుమారుడు కలుగగా ధర్మయాగం జరిపినందువలన ఆ కుర్రవాడు చిరంజీవుడైనాడు. అతడే ధర్మవర్మ. ధర్మయాగం జరిపించిన గ్రామానికి ధర్మపురి అను పేరుపెట్టి, దాన్నే రాజధానిగా చేసుకొని ఆంధ్రదేశాన్ని పాలించాడు. పూర్వం బ్రహ్మాది దేవతలు ధర్మవర్మ మహారాజును నృసింహుని గూర్చి తపస్సు చేయవలసినదిగా ప్రేరేపించారు. అతడు తపస్సు చేయగా స్వామి అక్కడ వెలిసారు. ఫాల్గుణ శుద్ధంలో స్వామి కల్యాణం జరుగుతుంది. ధర్మశర్మ, ధర్మవర్మ, ధర్మదాసుగా స్వామిని మూడు జన్మలలో అర్చించిన ధర్మజీవికి ఇది నెలవు. సాధ్వీమణి, శ్రీసత్యవతీదేవి ఇక్కడ గోదావరీ తీర్థమున స్నానమాడి తన జీవితేశ్వరుడగు ధర్మాంగద ప్రభువును సర్పరూపమునుండి విముక్తి గావించి సుందర మనిషి రూపము వచ్చునట్లు చేసిందిచ్చటనే. ఆ పతివ్రత తన పాతివ్రత్యమహత్యాన్ని నిరూపించడానికి ఇసుకతో నిర్మించిన స్తంభం ఇప్పటికీ భక్తులకు సత్యనిదర్శనముగాఉన్నది. బ్రహ్మాదిదేవతలు, మహర్షులు, ఋషులు, మునులు మహాభక్తులు ఇచ్చట స్వామిని అర్చించి తరించారు. భూషణవికాసధర్మపుర నివాస!దుష్ట సంహార! నరసింహ! దురితదూర! అనే మకుటం తో శతకం ఉంటుంది.

ఎంతో ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలు, చరిత్ర కలిగిన ఈ క్షేత్రం ప్రాచీన కాలంనుంచి వైదిక విద్యలకు, జ్యోతిశ్శాస్త్రానికి ప్రముఖస్థలముగా పేరొంది నేటికీ సాంప్రదాయ వేదవిద్యలకు నెలవైయున్నది. శాతవాహనులు, బాదామి చాళుక్యులు కళ్యాణి చాళుక్యుల కాలంలో ఈ ఆలయం ఉన్నతి స్థితిలో వున్నట్లు తెలుస్తున్నది. నైజామ్ కాలంలో కూడా ఈ ఆలయం మంచి అభివృద్ధి లో వుండేది. సా.శ. 1309లో అల్లాయుద్దీన్‌ఖిల్జీ ధర్మపురి ఆలయాల పై దాడి చేసి నాశనం చేశాడని చరిత్ర వల్ల తెలుస్తున్నది.

## గణపతి నవరాత్రులు (ఆగష్టు 27 నుండీ)



భారతదేశ ప్రజలు గణేశ నవరాత్రి ఉత్సవాలు జరువుకోవడానికి సమాయత్తమయ్యారు. పవిత్రమైన గణేశ నవరాత్రి ఉత్సవాలకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. గణేశ నవరాత్రి ఉత్సవాలను ముఖ్యంగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర మొదలైన రాష్ట్రాలలో అత్యంత ఘనంగా జరుపుకుంటారు. హిందువులు అందరూ సమిష్టిగా ఒక చోట చేరి గణేశ నవరాత్రి వేడుకలు జరుపుకుంటారు.

గణేశ నవరాత్రి ఉత్సవాలను అసలు ఎందుకు జరుపుకుంటారు? గణేష్ నవరాత్రి ఉత్సవాల యొక్క ప్రాశస్త్యం ఏమిటి? వంటి వివరాలను ప్రస్తుతం మనం తెలుసుకుందాం. వినాయక చవితి పండుగ మొదటి రోజున ప్రజలు తమ ఇళ్లల్లో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించి గణనాథుడికి స్వాగతం

పలుకుతారు. వినాయకుడిని పువ్వులతో అలంకరించి, తొమ్మిది రకాలైన పత్రితో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. అలా తొమ్మిది రోజులపాటు వినాయకుడికి పూజలు చేసి నిమజ్జనం చేసి వినాయకుడిని సాగనంపుతారు.

ఇళ్ళలో వినాయకుడి విగ్రహాలను పెట్టుకుని పూజించేవారు ఎన్ని రోజులు పూజలు నిర్వహించాలి అనేది పూర్తిగా వారిపైనే ఆధారపడి ఉంటుంది, ఇక వాడవాడలా గణేష్ మండపాలను ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు అత్యంత ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలను నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు నవరాత్రులు చెయ్యటం వెనుక ఒక పెద్ద కథనే ఉంది.

వినాయక చవితి పండుగను జరుపుకోవడం వెనుక అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ వినాయకచవితి పండుగ దేశభక్తికి, ఐక్యతకు ప్రతీకగా చెబుతారు. ప్రజలను ఏకం చేయడానికి వారి మధ్య ఉన్న కులతత్వ అంతరాలను తగ్గించడానికి బాలగంగాధర్ తిలక్ ఈ పండుగను ప్రారంభించారని చెబుతారు. చత్రపతి శివాజీ మహారాజ్ కాలం నాటికి ఈ పండుగను ఘనంగా జరుపుకునే వారని, ప్రజలలో జాతీయవాద స్ఫూర్తిని పెంపొందించడం కోసం గణేశ నవరాత్రి వేడుకలను నిర్వహించేవారని చెపుతారు.బహిరంగ ప్రదేశంలో పెద్ద మట్టి గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించిన మొదటి వ్యక్తి బాలగంగాధర్ తిలక్ అని చెప్తారు. గణేశ నవరాత్రి వేడుకలు చిన్నా, పెద్దా, పేద, ధనిక తేడా లేకుండా అందరూ సంతోషంగా జరుపుకుంటారని చెప్పొచ్చు.

### ఈ నెలలో ముఖ్యమైన రోజులు:

1. వరలక్ష్మీ వ్రతం, ఆగష్టు 8
2. శ్రావణపౌర్ణిమ, రక్షాబంధన్, ఆగష్టు9
3. స్వాతంత్ర్య దినోత్సవం, ఆగష్టు 15
4. హర్తాళికా వ్రతం, ఓనం, ఆగష్టు 26
5. రాధాష్టమి, ఆగష్టు 31

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి
research@csisindia.com

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact
research@csisindia.com
Contact : +917075881925

